సాక్షి
ములుగు
ఆదివారం | 5 | నవంబర్ | 2023



ఓట్ల కోసం నోట్ల కట్టలు తెచ్చారు

ఎన్నికల్లో ప్రజల ఓట్లను కొనుగోలు చేసేందుకు పలు పార్టీల నాయకులు నోట్ల కట్టలు తెచ్చారని ఎమ్మెల్యే అభ్యర్థి సీతక్క అన్నారు. - 11లో▸



పేదలకు ఇళ్లు కట్టించాకే..

నియోజక వర్గంలోని ఇళ్లులేని పేదలకు ఇళ్లు కట్టించాకే తాను ఇల్లు కట్టుకుంటానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. - 11లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి చలి పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ మలి విడత ప్రచార షెడ్యూల్

- ఉమ్మడి వరంగల్‌లో 13 నుంచి ఎన్నికల ప్రచారం..
- ముగింపు సభ వరంగల్‌లోనే..



సాక్షి ప్రతినిధి, వరంగల్: గులాబీ దళపతి, ముఖ్యమంత్రి కేసీఆర్ ఈనెల 13వ తేదీనుంచి సార్వత్రిక ఎన్నికల మలివిడత ప్రచారంలో భాగంగా ఉమ్మడి వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు కేసీఆర్ ప్రచార సభల షెడ్యూల్‌ను శనివారం రాత్రి పార్టీ వర్గాలు విడుదల చేశాయి. ఈ నెల 13 నుంచి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్న కేసీఆర్ 28వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. ఉమ్మడి వరంగల్‌లోని ఎనిమిది నియోజకవర్గాల్లో ప్రచారసభలు నిర్వహించనున్నారు. ప్రచారానికి చివరి రోజైన 28న వరంగల్‌లోనే ముగించనున్నారు. అక్టోబర్ 16న జనగామ నియోజకవర్గ కేంద్రంలో తొలి ప్రచార సభ నిర్వహించిన సీఎం.. ఆ తర్వాత వర్ధన్నపేట, మహబూబాబాద్ నియోజకవర్గంలో ప్రచారం చేశారు. మలి విడత ప్రచారంలో భాగంగా ఈ నెల 13 నుంచి 28 వరకు ఉమ్మడి వరంగల్‌లోని ఎనిమిది నియోజకవర్గాల్లో సభలు నిర్వహించనున్నారు. 13న నర్సంపేటలో, 14న పాలకుర్తిలో, 18 చేర్యాల(జనగామ)లో, 20న స్టేషన్ ఘన్‌పూర్, 21న డోర్నకల్, 24న ములుగు, భూపాలపల్లి, 28న వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో నిర్వహించే సభల్లో కేసీఆర్ పాల్గొంటారు.

రెండోరోజు నామినేషన్లు నిల్



ములుగు: ములుగు అసెంబ్లీ స్థానానికి రెండో రోజు కూడా ఒక్క నామినేషన్ దాఖలు కాలేదని జిల్లా రిటర్నింగ్ అధికారి, ఏటూరునాగారం పీఓ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల నియమావళి, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం నామినేషన్ల స్వీకరణ ఉండదని తెలిపారు. ఈ విషయాన్ని అన్ని పార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థులు గమనించాలని సూచించారు. తిరిగి సోమవారం ఉదయం 11గంటల నుంచి 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

మంత్రి వాహనం తనిఖీ

ములుగు రూరల్: ములుగు మండల పరిధిలోని జంగాలపల్లిలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్ పోస్టు వద్ద గోవిందరావుపేట మండల పరిధిలో ఏర్పాటు చేసిన బంజార సమ్మేళనానికి వెళ్తున్న రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ వాహనాన్ని పోలీసులు శనివారం తనిఖీ చేశారు. కాగా వాహనంలో ఎలాంటి ప్రచార సామగ్రి, నగదు లభించలేదు.


'కళా ఉత్సవ్'

ములుగు: జిల్లాలోని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కళా ఉత్సవ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు డీఈఓ పాణిని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 6, 7వ తేదీల్లో మండల స్థాయి, 9, 10వ తేదీల్లో 10 విభాగాలలో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా వివరాలకు విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ బద్దం సుదర్శన్‌రెడ్డిని సెల్ నంబర్ 9603672289లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఎర్రమ్మతల్లి ఉత్సవాలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద కొలువై ఉన్న ఎర్రమ్మ తల్లికి ప్రజలు, ఆలయ నిర్వాహకులు నేడు (ఆదివారం) ఉత్సవాలను నిర్వహించనున్నారు. తాళ్లగడ్డ నుంచి ఏటూరునాగారం వరకు నిత్యం ప్రమాదాలు జరిగేవి. ఈ క్రమంలో ఎర్రమ్మ తల్లిని ప్రతీ ఏడాది కొలుపు కొలుచుకొని ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ప్రమాదాల తగ్గుముఖం పట్టాయని భక్తుల విశ్వాసం. దీంతో ఎర్రమ్మతల్లి ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలను అలంకరించారు. ఎర్రమ్మ తల్లికి ఉత్సవాలు ప్రతీ ఏడాది నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వంగూరి నాగేశ్వర్‌రావు తెలిపారు.

రామప్పను సందర్శించిన అమెరికా దేశస్తుడు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని శనివారం అమెరికా దేశస్తుడు డోనాల్డ్ సందర్శించారు. రామప్ప రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం డోనాల్డ్‌కు రామప్ప శిల్పకళా సంపద గురించి సెంట్రల్ టూరిజం గైడ్ కరుణానిధి వివరించారు. ఈ సందర్భంగా డోనాల్డ్ రామప్ప వండర్‌ఫుల్‌గా ఉందని కొనియాడారు.

మొదలైన ఓట్ల ఆట!

జంగ్ తెలంగాణ


ఓరుగల్లులో సార్వత్రిక ఎన్నికల బరిలో మహామహులు

- తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మూడోసారి ఎన్నికలు
- బీఆర్ఎస్‌కు ఖరారైన 12 మంది అభ్యర్థులు
- బీజేపీకి రెండు చోట్ల.. కాంగ్రెస్ ఒక చోట పెండింగ్
- ప్రచారబరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు..
- కొనసాగుతున్న నామినేషన్ల ప్రక్రియ.. 8, 9, 10 తేదీల్లో అధికం
- 15 నుంచి హోరెత్తనున్న ఎన్నికల ప్రచారం



సాక్షిప్రతినిధి, వరంగల్:

ఓరుగల్లులో ఓట్ల ఆట మొదలైంది. శుక్రవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలు కాగా.. ప్రధాన పార్టీల అభ్యర్థులు అస్త్రశస్త్రాలతో సిద్ధమయ్యారు. నామినేషన్ల దాఖలు తర్వాత ప్రచారాన్ని మరింత ఉధృతంగా చేసేందుకు వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఉమ్మడి వరంగల్ బరిలో నిలిచేందుకు అభ్యర్థులు సన్నద్ధమయ్యారు. బీఆర్ఎస్ 12 అసెంబ్లీ నియోజకవర్గాలకు అభ్యర్థులను రెండు నెలల కిందటే ప్రకటించగా, ప్రచారంలో ముందంజలో ఉన్నారు. బీజేపీ 10 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయగా, ములుగు, నర్సంపేట నియోజకవర్గాలను పెండింగ్‌లో పెట్టారు. డోర్నకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కూడా ఖరారు కావాల్సి ఉంది. ఖరారైన చోట అన్ని పార్టీల అభ్యర్థులు ప్రచారం మొదలెట్టగా, అట్టహాసంగా నామినేషన్లు వేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత మూడోసారి జరుగుతున్న ఎన్నికలు ఓరుగల్లులో రసవత్తరంగా సాగనున్నాయి.



పరకాల: చల్లా ధర్మారెడ్డి (బీఆర్ఎస్), ప్రకాశ్‌రెడ్డి (కాంగ్రెస్), కాళీప్రసాద్‌రావు (బీజేపీ)

భూపాలపల్లి: వెంకటరమణారెడ్డి (బీఆర్ఎస్), సత్యనారాయణ (కాంగ్రెస్), కీర్తిరెడ్డి (బీజేపీ)

ములుగు: బడే నాగజ్యోతి (బీఆర్ఎస్), ధనసరి సీతక్క (కాంగ్రెస్), ఖరారు కావాల్సి ఉంది (బీజేపీ)

వర్ధన్నపేట: అరూరి రమేశ్ (బీఆర్ఎస్), కేఆర్ నాగరాజు (కాంగ్రెస్), కొండేటి శ్రీధర్ (బీజేపీ)

నర్సంపేట: సుదర్శన్ రెడ్డి (బీఆర్ఎస్), మాధవరెడ్డి (కాంగ్రెస్), ఖరారు కావాల్సి ఉంది (బీజేపీ)

వరంగల్ పశ్చిమ: వినయ్‌భాస్కర్ (బీఆర్ఎస్), రాజేందర్‌రెడ్డి (కాంగ్రెస్), రావు పద్మ (బీజేపీ)

మహబూబాబాద్: శంకర్‌నాయక్ (బీఆర్ఎస్), మురళీనాయక్ (కాంగ్రెస్), హుస్సేన్ నాయక్ (బీజేపీ)

వరంగల్ తూర్పు: నరేందర్ (బీఆర్ఎస్), కొండా సురేఖ (కాంగ్రెస్), ప్రదీప్‌రావు (బీజేపీ)

దోర్నకల్: రెడ్యానాయక్ (బీఆర్ఎస్), ఖరారు కావాల్సి ఉంది (కాంగ్రెస్), భూక్యా సంగీత (బీజేపీ)

స్టేషన్ ఘన్‌పూర్: కడియం శ్రీహరి (బీఆర్ఎస్), శనిగరం ఇందిర (కాంగ్రెస్), విజయరామారావు (బీజేపీ)

జనగామ: రాజేశ్వర్ రెడ్డి (బీఆర్ఎస్), ప్రతాప్‌రెడ్డి (కాంగ్రెస్), దశమంత రెడ్డి (బీజేపీ)

పాలకుర్తి: దయాకర్‌రావు (బీఆర్ఎస్), యశస్వినిరెడ్డి (కాంగ్రెస్), రామ్మోహన్‌రెడ్డి (బీజేపీ)

విజయమే లక్ష్యం.. వినూత్న వ్యూహం

ఈ నెలాఖరున జరిగే శాసన సభ ఎన్నికల్లో గెలుపు కోసం ప్రధాన పార్టీలు సరికొత్త వ్యూహాలు సిద్ధం చేసుకున్నాయి. అధికార బీఆర్ఎస్ పదేళ్లుగా ఉమ్మడి వరంగల్‌లో చేపట్టిన, వచ్చే ఐదేళ్లలో చేయబోయే అభివృద్ధిని ఓటర్ల ముందుంచే ప్రయత్నం చేస్తోంది. రైతుబంధు, దళితబంధు, ఆసరాతో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు బీఆర్ఎస్ నాయకులు వివరిస్తున్నారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో మూడు సభలు నిర్వహించారు. వచ్చే ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి పథకాలను వివరించారు.

బీజేపీ అభ్యర్థులు ములుగు, నర్సంపేట మినహా 10 నియోజకవర్గాల్లో ప్రచారం ముమ్మరం చేశారు. నామినేషన్ల అనంతరం మరింత ఉధృతం చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. సీనియర్ నాయకులంతా ఈసారి బరిలో నిలవగా గెలుపే లక్ష్యంగా అగ్రనేతలను ప్రచారంలోకి దింపేందుకు ఆ పార్టీ అధిష్టానం నేతలతో చర్చిస్తోంది.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీలను నియోజకవర్గాలు, గ్రామాల వారీగా ప్రణాళిక ప్రకారం ఓటర్ల ముందుకు తీసుకెళ్తున్నది. డోర్నకల్ మినహా అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులు ఖరారు కాగా.. అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఇటీవల ప్రకటించిన ఆరు హామీలను ప్రతీ గడపకు తీసుకెళ్లే క్రమంలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, మహాలక్ష్మి కింద ప్రతినెలా రూ.2,500, వృద్ధులకు పింఛనుగా రూ.4వేలు.. ఇలా ఆరు హామీలు జనంలోకి తీసుకెళ్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో ముక్కోణపు పోటీ..

ఉమ్మడి జిల్లా పరిధిలోని 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈసారి కూడా ముక్కోణపు పోటీ జరగనుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొననుంది. బహుజన సమాజ్‌వాదీ పార్టీ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌తో పాటు ఇతర పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించాయి. స్వతంత్రులు, రెబల్స్ కూడా ఈసారి బరిలో నిలవనుండగా.. ప్రధాన పోటీ కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ఉండే అవకాశం ఉంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇప్పటికే మహామహులను రంగంలోకి దింపాయి. కొత్తగా అసెంబ్లీకి పోటీ చేస్తున్న వారితో పాటు ఏడుసార్లు పోటీ చేసి ఎనిమిదోసారి భవిష్యత్ తేల్చుకునేందుకు కూడా సిద్ధమవుతున్నారు. నామినేషన్ల ఘట్టం ముగిస్తే పోరు మరింత రసవత్తరం కానుంది.

ఉమ్మడి జిల్లాలో ఓటర్లు ఇలా..

2018 ఎన్నికల్లో	26,12,841
2023 ఎన్నికల్లో	28,92,786

మంత్రుల్లో మనోళ్లు
- వివిధ ప్రభుత్వాల్లో వరంగల్ నేతలకు కీలక బాధ్యతలు

'నాయిని'పై 8 క్రిమినల్ కేసులు
- రూ.2 కోట్ల ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

వివరాలు 10లో

తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటుకు నిబంధనలు
- రాత్రి 10 దాటితే పబ్లిక్ మీటింగ్ పెట్టొద్దు
- ప్రచార తేదీ ముగిశాక ఓటర్లు కాని వారెవ్వరూ నియోజకవర్గంలో ఉండొద్దు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ములుగు: ఎన్నికల నిబంధనలు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తప్పకుండా పాటించాలని ములుగు అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు వాగీష్ కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ) సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, అపోహలు, వదంతులను ప్రచారం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంసీఎంసీ తరఫున తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ముందస్తు అనుమతులు లేకుండా ఎలాంటి మద్దతు వార్తలు, ప్రకటనలు చేసినా రాజకీయ పార్టీల అభ్యర్థుల ఖాతాలో జమ చేస్తామన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా, లోకల్ ఛానల్స్, వార్తా పత్రికలు, కేబుల్ నెట్‌వర్కుల్లో ప్రసారం అయ్యే వాటిని ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. అనంతరం ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురిచేసేలా పాత వీడియోలను ప్రసారం చేయడం మానుకోవాలని, అలాంటి వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తే గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం వ్యయ పరిశీలకుడు వాగీష్ కుమార్ సింగ్ జిల్లాలోని చెక్ పోస్టులు, సీసీ కెమెరాల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ డీఎస్.వెంకన్న, డీపీఆర్వో రఫిక్, ఎంసీఎంసీ కమిటీ సభ్యుడు శ్రీధర్, కొత్తపల్లి ప్రసాద్‌రావు, ఈడీఎం దేవేందర్, అధికారులు సత్యనారాయణ, అబ్దుల్ రహీం, భవిత, సురేష్, శ్రీనివాస్, ఫిరోజ్‌పాషా, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకుడు వాగీష్ కుమార్ సింగ్

భయపడకుండా ఓటేయండి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాజేడు: మావోయిస్టులకు భయపడకుండా నిర్భయంగా ఓటు వేయాలని ఎస్పీ గాష్ ఆలం అన్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్‌తో కలిసి శనివారం ఎస్పీ మండల కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మావోయిస్టులకు, ఇతర అసాంఘిక శక్తులకు భయపడవద్దన్నారు. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. నిరంతరం పోలీసులు ప్రజలకు రక్షణగా ఉంటారని తెలిపారు. ఎస్పీ వెంట వెంకటాపురం (కె)సీఐ బండారి కుమార్, వాజేడు, పేరూరు ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, రమేష్ ఉన్నారు.

తండాల తలరాతలు మార్చింది కేసీఆరే..

- మంత్రి సత్యవతి రాథోడ్

గోవిందరావుపేట: అర్హతగల తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి వాటి తలరాతలు మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, అలాంటి కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని గిరిజనాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని కమ్మ కమ్యూనిటీ హాల్‌లో ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి గెలుపు కోరుతూ శనివారం బంజారాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో గూడేలను గ్రామ పంచాయతీలుగా సీఎం కేసీఆర్ మార్చారని తెలిపారు. నాడు 7శాతం ఉన్న రిజర్వేషన్లను నేడు 12శాతానికి పెంచారని తెలిపారు. గతంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న తండాలు బీఆర్ఎస్ పాలనలో ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. ఎంపీ మాలోతు కవిత మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తెలంగాణలో 3,146 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో పాటు రూ.4 వేల కోట్లతో గిరిజన తండాలకు రోడ్లు వేయించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంటు, రైతుబంధు, రైతు బీమా వంటి పథకాలను విజయవంతంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మరిన్ని సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరిక గోవింద్ నాయక్, లకావత్ నరసింహ నాయక్, అజ్మీరా సురేష్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరపనేని సాయి కుమార్, ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చుక్క గట్టయ్య జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మోహన్ రాథోడ్, స్వాతివాగ, ఎంపీటీసీ రామచందర్, మేడారం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ చందూలాల్, అక్కినపల్లి రమేష్, పృథ్వీరాజ్, ఎల్ మమత, భూక్యా దేవ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్



సమావేశానికి హాజరైన బంజారా మహిళలు

3వ తేదీ: బీఆర్ఎస్‌లోకి..



4వ తేదీ : బీజేపీలోకి..



నగరంలోని 33వ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు చిలివేరి రాజేందర్ రోజుకో కండువా కప్పుకోవడం చర్చనీయాంశమైంది. 3వ తేదీనాడు ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. విషయం తెలిసిన వెంటనే బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావు శనివారం వెళ్లి బీజేపీ కండువా వేసి పార్టీలోకి చేర్చుకున్నాడు. దీంతో రాష్ట్రస్థాయి నాయకులే కాదు.. నగరనాయకులు కూడా జంపింగ్ జంపాంగ్‌లో తక్కువేమీ కాదని నగరవాసులు చర్చించుకుంటున్నారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

ఓరుగల్లుకు ఏఐసీసీ పరిశీలకులు..

- నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌ల నియామకం

సాక్షి ప్రతినిధి, వరంగల్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఉమ్మడి వరంగల్ లోని ఎనిమిది నియోజకవర్గాలకు అసెంబ్లీ పరిశీలకులను నియమించింది. ఈ పరిశీలకులు ఆదివారం నుంచి ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించనున్నారు. పాలకుర్తి నియోజకవర్గానికి మహేష్ కౌజల్ జీ, స్టేషన్‌ఘన్‌పూర్– ఉమశ్రీ, వరంగల్ పశ్చిమ – అబ్దుల్ జబ్బార్, వరంగల్ తూర్పు – కేసీ వీరేంద్ర, భూపాలపల్లి – కేవై నాంజే గౌడ, జనగామ – బసవరాజు రాయరెడ్డి, డోర్నకల్– ఈ తుకారాం, మహబూబాబాద్ – ఎన్.వై గోపాలకృష్ణను నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మరో నాలుగు నియోజకవర్గాలకు కూడా త్వరలోనే పరిశీలకులను నియమించనున్నట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఓడినా.. ఊకోడు..

- ఐదోసారి నామినేషన్

పరకాల: జీవితంలో ఒక్కసారైనా ఎమ్మెల్యే కావాలనే తపన ఆయనది. పరకాల అసెంబ్లీ స్థానానికి మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన మోటార్ దుకాణం వ్యాపారి బుచ్చిరెడ్డి శనివారం ఐదో సారి నామినేషన్ వేశారు. 2009, 2012(ఉపఎన్నిక), 2014, 2018తో పాటు 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడం విశేషం. పలుమార్లు నామినేషన్ వేసిన ఆయన ఏ ఒక్కసారి ఉపసంహరించుకోకుండా బరిలో నిలవడం..ఓడిపోవడం పరిపాటే. కాగా, మర్యాదగా గ్రామంలో కొందరు ఆయనను ఎమ్మెల్యే సాబ్ అని పిలుస్తుంటారు.



ఐదో సారి నామినేషన్ వేస్తున్న బుచ్చిరెడ్డి

తాత్కాలిక కార్యాలయాల ఏర్పాటుకు నిబంధనలు..

ఈ ముచ్చటెరికేనా ?

కాజీపేట : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరఫున పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలిక కార్యాలయాలు ఏర్పాటు చేయడం సహజం. రోజూ కార్యకర్తలు ఉదయం, సాయంత్రం వేళల్లో కలుసుకుని ఆ రోజు జరిగిన ప్రచార సరళిపై చర్చించుకోవడం.. అభ్యర్థులు వచ్చిన సమయంలో మాట్లాడుకోవడానికి ఈ కార్యాలయాలు ఉపయోగపడుతాయి. అయితే వీటి ఏర్పాటుకు ఎన్నికల కమిషన్ మార్గదర్శక సూత్రాలు విడుదల చేసింది. **ఆ సూత్రాల ప్రకారం..**

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రార్థనా స్థలాలు, పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల లోపు దూరంలో తాత్కాలిక కార్యాలయాలు ఉండొద్దు.
- కార్యాలయాలపై తమ పార్టీ జెండా, బ్యానర్, పార్టీ చిహ్నాలు ఏర్పాటు చేసుకోవచ్చు.
- ఉదయం 6 లోపు, రాత్రి 10 గంటల సమయం దాటితే ఎలాంటి మైక్‌లు, లౌడ్ స్పీకర్లు వినియోగించొద్దు.
- ఎన్నికల ప్రచార తేదీ ముగిసిన అనంతరం ఓటర్లు కాని వారెవరూ నియోజక వర్గంలో ఉండొద్దు. అయితే అభ్యర్థులు, ఎలక్షన్ ఏజెంట్‌కు ఈ నిబంధన వర్తించదు.
- రాత్రి 10 గంటల తర్వాత ఎలాంటి పబ్లిక్ మీటింగ్ ఏర్పాటు చేయొద్దు.
- పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటరుగా నమోదైన ఫొటోతో కూడిన ఓటరు గుర్తింపు కార్డు కలిగిన వ్యక్తి మాత్రమే పోలింగ్ ఏజెంట్‌గా ఉండడానికి అర్హుడు.
- ఎస్ఎంఎస్ ద్వారా సోషల్ మీడియాలో ఎలాంటి విషయాలు, వార్తలను ప్రచారం చేయొద్దు.

'నాయిని'పై 8 క్రిమినల్ కేసులు..

- రూ. 2 కోట్ల ఆస్తులు
- ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడి

హన్మకొండ అర్బన్ : కాంగ్రెస్ పార్టీ వరంగల్ పశ్చిమ అభ్యర్థిగా శనివారం నామినేషన్ దాఖలు చేసిన నాయిని రాజేందర్‌రెడ్డి తన ఎన్నికల అఫిడవిట్‌లో తను, తన భార్య పేరుతో ఉన్న స్థిర, చర ఆస్తులు, అప్పులు, ఆదాయ మార్గాలు, క్రిమినల్ కేసులకు సంబంధించి వివరాలు వెల్లడించారు. ఆ వివరాల ప్రకారం..



పేరు: నాయిని రాజేందర్‌రెడ్డి
చరస్తుల విలువ: రూ. 1,13,37,546
స్థిరాస్తులు: వ్యవసాయ భూములు, ఇతర ప్లాట్లు మొత్తం రూ. 99,85,172
నిర్మాణ రంగంలో, ఇతర డెవలప్‌మెంట్స్‌లో ఉన్న వాటి విలువ రూ.10,11,250
మొత్తం ఆస్తుల సుమారు విలువ: రూ.2,0700,000
ఉమ్మడి కుటుంబ ఆస్తులు: రూ. 30 లక్షలు
అప్పు
బ్యాంకు రుణం : రూ.1,17,12,949

భార్య: నాయిని నీలిమారెడ్డి
చరాస్తుల విలువ: రూ.92,65,638
స్థిరాస్తులు: రూ.75.91.290
మొత్తం ఆస్తుల విలువ సుమారు: రూ.3.02కోట్లు
అప్పు
బ్యాంకు రుణం : రూ.9,00,024

- నాయిని వద్ద రూ.73,782, భార్య వద్ద రూ.1,38,038 నగదు ఉన్నట్లు తెలిపారు.
- తన వద్ద 200 గ్రాములు, తన భార్య వద్ద 650 గ్రాముల బంగారం ఉంది.
- తన పేరుతో టయోటా ఫర్చ్యూనర్ వాహనం ఉందని తెలిపారు.
- తన పేరుతో మహబూబాబాద్, హైదరాబాద్‌లోని ఘట్‌కేసర్‌లో వ్యవసాయ భూములు, గోపాల్‌పూర్, మడికొండ ప్రాంతాల్లో ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు.
- భార్య పేరుతో గోపాల్‌పూర్, బీబీనగర్, హనుమకొండ, మెదక్, తదితర ప్రాంతాల్లో ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు.


విద్య:
1990లో హనుమకొండలోని ఆర్ట్స్అండ్ సైన్స్ కాలేజీలో బీకాం పూర్తి చేశారు.

మంత్రుల్లో మనోళ్లు..!

వివిధ ప్రభుత్వాల్లో వరంగల్ నేతలకు కీలక బాధ్యతలు

- సమర్థవంతంగా పని చేస్తూ పదవులకే వన్నె తెస్తున్న ప్రజాప్రతినిధులు
- ఉమ్మడి జిల్లా నుంచి అమాత్యులుగా పని చేసిన పలువురు

1956లో ఆవిర్భవించిన ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలు.. 2014లో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం వరకు రాజకీయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్ర పోషిస్తోంది. వివిధ పార్టీల నుంచి ప్రజా ప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు ఆయా ప్రభుత్వాల్లో మంత్రులుగా పని చేసి ఆ పదవులకే వన్నె తెస్తున్నారు. సమర్థవంతంగా పనిచేస్తూ ఇటు ప్రజలతో.. అటు ప్రభుత్వాలతో జేజేలు అందుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 1960 సంవత్సరం మొదలు.. 2023 వరకు ఉమ్మడి జిల్లా నుంచి అమాత్యులుగా పని చేసిన వారు, వారి వివరాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.



ఉమ్మడి వరంగల్ జిల్లా

హన్మకొండ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1960 నుంచి ఇప్పటి వరకు 23 మంది ప్రజాప్రతినిధులు రాష్ట మంత్రులుగా పని చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 13 మంది పని చేయగా.. టీడీపీ, బీఆర్ఎస్ ప్రభుత్వంలో 9 మంది మంత్రులుగా కొనసాగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్ నుంచి ఒక్కరు మంత్రిగా ఉన్నారు. కాంగ్రెస్ నుంచి నూకల రాంచంద్రారెడ్డి, పింగిళి ధర్మారెడ్డి, గోక రామస్వామి, టి.హయగ్రీవాచారి, మాదాడి నర్సింహారెడ్డి, బొచ్చు సమ్మయ్య, పోరిక జగన్నాయక్, తక్కళ్లపల్లి పురుషోత్తమరావు, పీవీ రంగారావు, పొన్నాల లక్ష్మయ్య, కొండా సురేఖ, డీఎస్ రెడ్యానాయక్, బస్వరాజు సారయ్య మంత్రులుగా పని చేశారు. టీడీపీ ప్రభుత్వంలో సంగంరెడ్డి (ముచ్చర్ల) సత్యనారాయణ, నెమరుగొమ్ముల యతిరాజారావు, నిమ్మ రాజారెడ్డి, దాస్యం ప్రణయ్‌భాస్కర్, కడియం శ్రీహరి మంత్రులుగా కొనసాగారు. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) ప్రభుత్వంలో తాటికొండ రాజయ్య తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రిగా, కడియం శ్రీహరి రెండో ఉప ముఖ్యమంత్రిగా, మంత్రిగా, అజ్మీరా చందూలాల్ మంత్రులుగా పని చేశారు. ప్రస్తుతం సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు మంత్రులుగా కొనసాగుతున్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో గుండె విజయరామారావు మంత్రిగా పని చేశారు. కాగా, సహాయ మంత్రి హోదాలో దాస్యం వినయ్‌భాస్కర్ పార్లమెంటరీ సెక్రటరీగా పని చేశారు.

మాదాడి నర్సింహారెడ్డి



మాదాడి నర్సింహారెడ్డి 1985, 1989లో శాయంపేట నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా విజయం సాధించారు. నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో పురపాలక శాఖ మంత్రిగా పని చేశారు.

పోరిక జగన్నాయక్



పోరిక జగన్నాయక్ 1978, 1989లో ములుగు నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. 1992లో కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి కేబినెట్‌లో గిరిజన శాఖ మంత్రిగా కొనసాగారు.

గుండె విజయరామారావు



గుండె విజయ రామారావు 1984లో టీడీపీ నుంచి సిద్దిపేట ఎంపీగా, 1994లో గజ్వేల్ నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2004లో జరిగిన ఎన్నికల్లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ సంకీర్ణ ప్రభుత్వంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రిగా కొనసాగారు.

పొన్నాల లక్ష్మయ్య



పొన్నాల లక్ష్మయ్య 1989, 1999, 2004, 2009 ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2004 నుంచి 2009 భారీ, మధ్య తరహా నీటిపారుదల శాఖ మంత్రిగా, 2010లో రాష్ట్ర ఐటీ, కమ్యునికేషన్ శాఖ మంత్రిగా కొనసాగారు. అంతకు ముందు 1991–1992లో మత్స్యశాఖ మంత్రిగా పని చేశారు.

అజ్మీరా చందూలాల్



అజ్మీరా చందూలాల్ 1985, 1994, 2014లో ములుగు నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ కేబినెట్‌లో సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, 1989లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా, బీఆర్ఎస్ ప్రభుత్వంలో గిరిజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిగా పని చేశారు.

సంఘం రెడ్డి (ముచ్చర్ల) సత్యనారాయణ




సంగం రెడ్డి సత్యనారాయణ హనుమకొండ నియోజకవర్గం నుంచి 1983లో శాసన సభకు ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు టి.హయగ్రీవాచారిని ఓడించి మంత్రి వర్గంలో చోటు సాధించారు. రవాణా శాఖమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

ఎర్రబెల్లి దయాకర్ రావు



ఎర్రబెల్లి దయాకర్‌రావు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 1994, 1999, 2004, 2009, 2014లో టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. 2018లో బీఆర్ఎస్ నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. కేసీఆర్ మంత్రి వర్గంలో ప్రస్తుతం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

నూకల రాంచంద్రారెడ్డి



నూకల రాంచంద్రారెడ్డి డోర్నకల్ నియోజకవర్గం నుంచి 1957, 1962, 1967, 1972లో శాసన సభకు ఎన్నికయ్యారు. 1972లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1960లో మొదటి సారి దామోదరం సంజీవయ్య మంత్రి వర్గంలో ఆహార, వ్యవసాయం, కార్మిక, భూ సంస్కరణల మంత్రిగా కొనసాగారు. 1962లో నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో రెవెన్యూ భూ సంస్కరణల మంత్రిగా పని చేశారు. 1964 నుంచి 1967 వరకు కాసు బ్రహ్మానందారెడ్డి మంత్రి వర్గంలో రెవెన్యూ భూసంస్కరణల మంత్రిగా, 1973లో జలగం వెంగళరావు మంత్రి వర్గంలో ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా పని చేశారు.

హయగ్రీవాచారి



టి.హయగ్రీవాచారి 1957, 1962లో ధర్మసాగర్ నియోజకవర్గం నుంచి, 1972లో స్టేషన్‌ఘన్‌పూర్, 1978లో హనుమకొండ శాసన సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. మర్రి చెన్నారెడ్డి మంత్రి వర్గంలో సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా పని చేశారు.

పీవీ రంగారావు



పీవీ రంగారావు హనుమకొండ నియోజకవర్గం నుంచి 1989లో జరిగిన సాధారణ ఎన్నికల్లో, ప్రణయ్‌భాస్కర్ మృతితో 1998లో జరిగిన ఉప ఎన్నికలో శాసన సభ్యుడిగా విజయం సాధించారు. కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా పని చేశారు.

నెమరుగొమ్ముల యతిరాజారావు



నెమరుగొమ్ముల యతిరాజారావు కాంగ్రెస్ నుంచి 1962, 1967, 1975 (ఉప ఎన్నిక), టీడీపీ నుంచి 1983 నుంచి 1999 వరకు చెన్నూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో రోడ్లు, భవనాల శాఖ, దేవాదాయ, ధర్మాదాయ శాఖమంత్రిగా పని చేశారు.

కొండా సురేఖ




కొండా సురేఖ 1999, 2004లో శాయంపేట నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2009లో పరకాల నుంచి, 2014లో వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రి వర్గంలో మహిళా, శిశు, బధిరుల సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

నిమ్మ రాజారెడ్డి



నిమ్మ రాజారెడ్డి చేర్యాల నియోజకవర్గం నుంచి 1983, 1985, 1989, 1994 శాసనసభ ఎన్నికల్లో నాలుగు సార్లు వరుస విజయాలు సాధించారు. ఎన్టీఆర్ మంత్రి వర్గంలో విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

కడియం శ్రీహరి



కడియం శ్రీహరి స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి 1994, 1999, 2008 (టీడీపీ) శాసన సభకు ఎన్నికయ్యారు. 1994లో తొలిసారి శాసన సభకు ఎన్నికైన కడియం శ్రీహరిని ఎన్టీఆర్ మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో మార్కెటింగ్ శాఖ మంత్రిగా పని చేశారు. అనంతరం చంద్రబాబు కేబినెట్‌లో విద్యా శాఖ, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా, కేసీఆర్ మంత్రి వర్గంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా విద్యా శాఖ మంత్రిగా పని చేశారు.

సత్యవతి రాథోడ్



సత్యవతి రాథోడ్ 2009లో టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత 2014లో ఆ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) నుంచి 2019లో ఎమ్మెల్సీగా ఎన్నికైన సత్యవతి రాథోడ్.. కేసీఆర్ మంత్రి వర్గంలో ప్రస్తుతం మహిళాభివృద్ధి, శిశు, దివ్యాంగులు, వృద్ధులు, గిరిజన సంక్షేమ శాఖమంత్రిగా కొనసాగుతున్నారు.

పింగిళి ధర్మారెడ్డి



పింగిళి ధర్మారెడ్డి పరకాల నియోజకవర్గం నుంచి 1972లో శాసనసభకు ఎన్నికయ్యారు. పీవీ నరసింహారావు కేబినెట్‌లో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా కూడా కొనసాగారు.

రామస్వామి



గోకా రామస్వామి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా 1978, 1983లో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1978 నుంచి 1979 వరకు మర్రి చెన్నారెడ్డి కేబినెట్‌లో ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రిగా, టంగుటూరి అంజయ్య కేబినెట్‌లో 1980 నుంచి 1982 వరకు రవాణా, మత్స్య, ఉద్యానవన అభివృద్ధి శాఖల మంత్రిగా పని చేశారు.

బొచ్చు సమ్మయ్య



బొచ్చు సమ్మయ్య 1978, 1983లో పరకాల నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 1978లో మర్రి చెన్నారెడ్డి, 1982లో కోట్ల విజయ భాస్కర్ రెడ్డి కేబినెట్‌లో మత్స్య శాఖ మంత్రిగా పని చేశారు.

తక్కళ్లపల్లి పురుషోత్తమ రావు



తక్కళ్లపల్లి పురుషోత్తమరావు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 1967, 1972 ఎన్నికల్లో, 1989లో వరంగల్ నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రి వర్గంలో 1993 నుంచి 1994 వరకు రాష్ట్ర రోడ్లు, భవనాలు, ఓడరేవుల శాఖ మంత్రిగా పని చేశారు.

బస్వరాజు సారయ్య



బస్వరాజు సారయ్య 1999, 2004, 2009 ఎన్నికల్లో వరంగల్, వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. 2010 నుంచి 2014 వరకు కిరణ్‌కుమార్ రెడ్డి మంత్రి వర్గంలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

ధరంసోతు రెడ్యా నాయక్



ధరంసోతు రెడ్యానాయక్ 1989, 1994, 1999, 2004, 2014 (కాంగ్రెస్), 2018 బీఆర్ఎస్ నుంచి శాసన సభకు ఎన్నికయ్యారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు.

దాస్యం ప్రణయ్ భాస్కర్



దాస్యం ప్రణయ్ భాస్కర్ హనుమకొండ నియోజకవర్గం నుంచి 1994లో శాసనసభకు ఎన్నికయ్యారు. పీవీ రంగారావుపై విజయం సాధించడంతో అప్పటి సీఎం ఎన్టీఆర్ ప్రణయ్‌భాస్కర్‌ను మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. యువజన, క్రీడల శాఖ మంత్రిగా కొనసాగారు.

తాటికొండ రాజయ్య



తాటికొండ రాజయ్య స్టేషన్ ఘన్‌పూర్ నుంచి 2009 (కాంగ్రెస్), 2012లో కాంగ్రెస్‌కు, పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరడంతో 2012లో వచ్చిన ఉప ఎన్నికలో, 2014, 2018లో శాసన సభకు ఎన్నికయ్యారు. 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర తొలి కేబినెట్‌లో తొలి ఉప ముఖ్యమంత్రిగా, వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా కొనసాగారు.

దాస్యం వినయ్ భాస్కర్



దాస్యం వినయ్ భాస్కర్ 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2015 సంవత్సరంలో సహాయ మంత్రి హోదాలో పార్లమెంట్ కార్యదర్శిగా పని చేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్‌గా కొనసాగుతున్నారు.